
# నిజాయితీ

మడత కుర్చీలో కూర్చున్న రమణమూర్తి సుదీర్ఘంగా ఏదో ఆలోచిస్తున్నాడు. ఏమండీ సరుకుల లిస్టు రాసి గంట అయ్యింది. కిరాణా కొట్టుకి వెళ్ళి ఆ లిస్టు ఇచ్చి రండి. పదో తారీకు వచ్చింది. ఇంకా సరుకులు తెచ్చుకోక పోతే ఎలా? అంటూ బయటకు వచ్చింది భార్య సుందరమ్మ.

మేకునున్న చొక్కా తీసి వేసుకుంటూ ఆ పర్సులో ఉన్న ఎ.టి.ఎమ్. కార్డు ఇవ్వు. సెంటర్ వరకూ వెళ్ళి డబ్బులు డ్రా చేసి, వచ్చేటప్పుడు కిరాణా కొట్టులో ఆ సరుకుల లిస్టు ఇచ్చి వస్తాలే... అన్న రమణమూర్తిగారి మాటలు పూర్తి కాకుండానే ఆ... ఏంటి పర్సా? పర్సుపోయి నాలుగు రోజులు అయ్యింది. ఎ.టి.ఎమ్. కార్డు కూడా పోయిందన్న విషయాన్ని మర్చిపోయారా? అసలు ఏ ధ్యాసలో ఉన్నారండీ... అంటూ మొదలు పెట్టింది తనదైన ధోరణిలో భార్య సుందరమ్మ.



**వేలూరి సుధారాణి**

రమణమూర్తి గొప్ప కథారచయిత, మంచి విద్యావేత్త, కులమతాలకు అతీతంగా మంచి తనం, మానవత్వం ఆయన స్వంతం. ఆయనకు ఇద్దరు సంతానం. కొడుకు పవన్ ఇంజనీరింగ్ చదువుకొని కాలేజీలో తనకు నచ్చిన (వేరే కులం) అమ్మాయిని పెళ్ళి చేసుకుని ఇంటికి వచ్చాడు. రమణమూర్తి గారు పెద్ద మనసుతో ఆశీర్వదించారు. సుందరమ్మ గారు మాత్రం ఆ వివాహాన్ని అంగీకరించలేక పోయారు. ఎందుకంటే ఆవిడ ఇంకా పాత కాలపు మనిషి. ఆచారాలు, సంప్రదాయాలు పాటిస్తున్న మనిషి. కోడలు మంచి పిల్ల, చదువుకున్న అమ్మాయి. ఇప్పుడు ఇవన్నీ మామూలేనంటూ రమణమూర్తిగారు నచ్చచెప్పారు. కొడుకు పవన్‌కూడా బ్రతిమాలాడు, ప్రాధేయ పడ్డాడు. అయినా సుందరమ్మగారు ససేమిరా ఒప్పుకోలేదు. ఈలోపు ఉద్యోగం అంటూ వీసా వచ్చిపడింది. నచ్చిన అమ్మాయితో, మెచ్చిన ఉద్యోగంతో విలాసవంతమైన జీవితం కోసం విదేశాలకు వెళ్ళిపోయాడు. ఇరవై నాలుగు సంవత్సరాలు పెంచి పోషించిన కన్నకొడుకు తమని వదిలి వెళ్ళిపోయాడు. మూర్తిగారు కాదనలేకపోయారు. ఇక కూతురు ప్రవల్లిక డిగ్రీ పూర్తి చేసింది. పి.జి. చదువుతానంది. కానీ కన్నవారికి మరో పాఠం నేర్పిస్తుందేమో అనుకున్న రమణమూర్తి దంపతులు తమ దగ్గర బంధువులలో మంచి సంబంధం చూసి, వారు కోరిన కట్నకానుకలు ఇచ్చి, పెళ్ళి చేసి అత్త వారింటికి సాగనంపారు. రమణమూర్తిగారు సంపాదించిన డబ్బంతా కూతురి పెళ్ళికి ఖర్చు చేశారు. నలభైఏళ్ళు కాలేజీలో పనిచేసినా స్వంత ఇల్లు కూడా ఏర్పాటుచేసుకోలేకపోయారు. పెన్షన్ ఆధారంతోనే ఆ ఇద్దరి జీవితాలూ నడుస్తున్నాయి.

☆ ☆ ☆

'ఏమోయ్! వంట ఎంతవరకూ వచ్చింది...? ఒంటి గంటవుతోంది. బాగా ఆకలి వేస్తోంది అంటూ వంటింట్లోకి వచ్చారు మూర్తి గారు. ఆయన అసలే బి.పి. పేషెంట్. టైమ్‌కి తిని విశ్రాంతి తీసుకోవడం అలవాటు.

చేత్తో హారతి ఇస్తూ ఏమండీ వచ్చి దండం పెట్టుకోండి అంటూ భర్తను ఆజ్ఞాపించింది సుందరమ్మ. రమణమూర్తిగారు బుద్ధిగా వెళ్ళి దణ్ణం పెట్టుకొని వచ్చి డైనింగ్ టేబుల్ వద్ద భోజనానికి సిద్ధమయ్యారు.

సుందరమ్మ మడిచీర కట్టుకొని, కాళ్ళకు పసుపు రాసుకొని ఉంది. చెమటకు రేగిన కుంకుమ బొట్టుతో పెద్ద కళ్ళు, పచ్చని ఛాయతో ఈ వయసులో కూడా చూడచక్కని రూపం ఆమెది. తనవైపే చూస్తున్న భర్తతో ఇన్నేళ్లు గడిచినా ఇంకా నన్నేం చూస్తారు లెండి... అంటూ చకచకా వడ్డన ప్రారంభించింది. తోట కూర పప్పు, దోసకాయపచ్చడి, కాకరకాయ కూరతో కబుర్లు చెప్పుకుంటూ తృప్తిగా భోజనం ముగించారు ఆ దంపతులు.

భోజనం ముగిసిన తర్వాత మూర్తిగారు హాల్‌లోకి వచ్చి టి.వి. ఆన్ చేశారు. సుందరమ్మగారు వంటిల్లు సర్దుకుంటున్నారు. పోస్ట్ వస్తే దానిని తీసి చూశారు మూర్తిగారు. ఏమోయ్... నిన్నేనే... నీ కూతురు ఉత్తరం రాసింది.

ఆ... ఆ... వస్తున్నా... అంటూ పైట చెంగుతో చేతులు తుడుచుకుంటూ ఏమిటి విశేషాలు? ఆనందంగా, ఆతృతగా అడిగారు ఆమె.

ఆ... ఏమీ లేదు నీ కూతురు నిన్ను అమ్మమ్మ, నన్ను తాతయ్య పోస్టులకి ప్రమోట్ చేస్తోందంతే.

ఆ... నిజమా...! ఎంత మంచి కబురు చెప్పారు. నా చిన్ని తల్లి నా ప్రవల్లిక అమ్మవు

తోందా? ఏవండీ అది ఇంకా నా కంటికి చిన్న పిల్లలాగే కనిపిస్తుందండీ అంటూ భర్త దగ్గరగా వచ్చి కూర్చుని, ఒక్కసారి తనను చూసొద్దామండీ! ఎందుకో దానిని చూడాలనిపిస్తోంది పదేపదే... అంటూ కంట తడి పెట్టుకున్నారు సుందరమ్మగారు...

ఛీ... ఈ మాత్రం దానికి కంటతడిపెట్టాలా? నువ్వు అడిగితే నేను కాదంటానా పిచ్చిదానా? నాకు లేదా మమకారం?... రేపు పినాకినికి బయలుదేరదాం అన్నారాయన.

☆ ☆ ☆

ఉదయాన్నే లేచి అన్నీ సర్దుకొని రైల్వేస్టేషన్‌కి చేరుకున్నారు. అది జనరల్ కంపార్ట్‌మెంట్. అతి కష్టం మీద కూర్చోడానికి సీట్లు దొరికాయి. సుందరమ్మగారు కూర్చొని, శాల్తీలు లెక్కబెడుతున్నారు. పచ్చడి సీసాలు జాగ్రత్త పెడుతున్నారు. ఏవండీ... ఈ సీసా నుంచి నూనె కారుతున్నట్లుందండీ అన్న సుందరమ్మతో వద్దంటే విన్నావా! ఇప్పుడు ఆ పచ్చళ్ళను మద్రాస్ వరకూ ఎట్లా తీసుకుపోతావో పో... నీ కర్మ! అనుభవించు అంటూ దినపత్రిక చూడడంలో మునిగిపోయారు మూర్తిగారు.

ఆ... సింగినాథం... కడుపుతో ఉన్న పిల్ల కదా అని కాస్తా అవకాయ, మాగాయ, మెంతికారం, పెసర ఆవకాయ, నిమ్మకాయ, మరి కాస్తా టమోటా పట్టుకున్నానంతే అంటూ దీర్ఘాలు తీస్తూ చదివారు సుందరమ్మగారు.

రైలు కదులుతోంది. దుగ్గిరాల, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు స్టేషన్లు దాటుకుంటూ రైలు పోతోంది. రైలులో ప్రయాణీకులు నిండుగా ఉన్నారు. ముగ్గురు కూర్చోవాల్సిన సీట్లో నలుగురు కూర్చున్నారు. సీట్లు లేక చాలా మంది నిల్చునే ఉన్నారు. విజయవాడలో ఎక్కినప్పటి నుంచి ఇద్దరు తల్లీకూతుళ్లు నిలబడే

## బ్రెయిన్ టీజర్స్

### తెలుసుకోవడం... ఈజీ...

హాస్టల్ గదిలోని భగవద్గీత పుస్తకాన్ని అట్ట తెరవకుండానే తెలుసుకోవడం ఎలా?

[illegible]

ఉన్నారు. దయాగుణం ఉన్న రమణమూర్తిగారు ఒకరిని తన భార్య పక్కగా కూర్చోబెట్టి, మరొకరిని తన పక్కగా చోటు ఇచ్చి కూర్చోమన్నారు. సుందరమ్మకు కొంచెం కోపం వచ్చింది. అసలే ఇరుకుగా ఉంటే ఇంకొకర్ని కూర్చోబెట్టారు ఏమిటీ ఈ మనిషి అంటూ మనసులోనే విసుక్కున్నారు. కూర్చున్న తల్లీకూతుళ్లు సుందరమ్మతో ఏదో మాట కలపబోయారు. ఆమె బదులు చెప్పకుండా జరిగి కూర్చున్నారు. వెధవ సంత... వెధవ సంత... అనుకుంటూ... కొద్దిసేపటి తర్వాత తల్లి బ్యాగులో నుంచి ఏదో పుస్తకం తీసి చదువుకుంటోంది. ఆ పుస్తకంపైన సువార్త సందేశం అని రాసి ఉంది. అది చూసిన సుందరమ్మకు కోపం రెట్టింపైంది. ఆమెకు భర్త మీద కోపం ముంచుకొచ్చింది. ఏం ఖర్మ బాబూ... నేను మడి మీద చేసుకున్న పచ్చళ్ళు ముట్టుకుంటారో ఏమో... పాడు... అంటూ పచ్చళ్ళ సంచిని సీటుకిందకు జరిపింది. రెండున్నర కల్లా మద్రాస్ స్టేషన్‌లో రైలు ఆగింది. ఆటోకు డబ్బులు ఇద్దామని ఫ్యాంటు జేబులో చెయ్యిపెట్టిన మూర్తిగారికి పర్సు కనిపించలేదు. ఒక్క నిమిషం ఆగి, సుందరీ నీ దగ్గర ఏమైనా డబ్బులున్నాయా అని అడిగారు. అయ్యో మీ పర్సు ఏమైందండీ! నా దగ్గర ఏం డబ్బులుంటాయి? మీరు ఇస్తేనే కదా! అప్పుడప్పుడూ ఇంటిఖర్చులకి ఇచ్చిన డబ్బుల్లో దాచిన చిల్లర

అంటూ బ్యాగ్ అంతా వెతికి డెబ్బై రూపాయలు ఇచ్చింది. ఆ డబ్బులు ఆటోకి ఇచ్చి ఇల్లు చేరారు.

తల్లిదండ్రులను చూసిన ప్రవల్లిక ఎంతో ఆప్యాయంగా పలుకరించి, దగ్గర కూర్చొని కొసరికొసరి అన్నం వడ్డించింది. కూతురు సంసారం, ఆమె ముఖంలో సంతోషం చూసిన ఆ దంపతులు ఎంతో తృప్తి చెందారు. ప్రవల్లిక తల్లి దగ్గర పడుకొని అమ్మా విజయవాడ కబుర్లు ఏమిటి? ప్రయాణం సుఖంగా జరిగిందా? అంటూ కుశల ప్రశ్నలు వేసింది. ఆ... ఏమి సుఖమే తల్లీ... ఎవరో క్రిస్టియన్స్‌ని మీ నాన్న పక్కన కూర్చోబెట్టారు. వాళ్ళ దగ్గర మంచినీళ్ళు కూడా తాగారు. నా పచ్చుళ్ళు ఎక్కడ ముట్టుకుంటారోనని హడలి చచ్చానే అమ్మా... అంటూ ఏకధాటిగా చెప్పుకుపోతున్నారు సుందరమ్మగారు. పోనీలే అమ్మా... రైలులో అవన్నీ మామూలే అంటున్న ప్రవల్లికను అదేంటే పవ్వా నువ్వు కూడా మీ నాన్నగారి లాగానే మాట్లాడుతున్నావు. అసలు నీకు ఇంకో విషయం చెప్పనా?... పక్కన కూర్చోబెట్టుకున్న ఆ క్రిస్టియన్స్ మీ నాన్నగారి పర్సు కొట్టేసారే తల్లీ... అందులో మూడు వేల రూపాయలు, నాన్నగారి ఏటిఎమ్ కార్డు, క్రెడిట్‌కార్డు, ఇంకా చెక్కులూ ఉన్నాయట. ఏవో నా దగ్గర కాస్త చిల్లర డబ్బులు ఉండబట్టి నీ ఇల్లు చేరామే తల్లీ...! లేకపోతే స్టేషన్‌లోనే ఉండేవాళ్ళం... అప్వ మన పరువు ఏమైపోయి ఉండేది? అంటూ ఫుల్‌స్టాప్‌లు, కామాలూ లేకుండా చెప్పుకుపోతున్నారు ఆమె. ఇంతలో రమణమూర్తిగారు చాల్లే... నోరుమూసుకో. పాపం ఆడకూతుళ్ళు నిలబడి ఉంటే కూర్చోమన్నాను. వాళ్లు అలా చేసి ఉండరులే... మంచి వాళ్లలానే ఉన్నారు అన్నారాయన. ఆ... మీ పొగడ్తలు చాలించండి... దొంగముండలు... దొంగముండలు... ఆ ముఖాలు చూడండి... చింపిరి జుట్టు... అతికిన గుడ్డలు... మంచివాళ్ళులాగా నటించి మనబోటి వాళ్ళను మోసం చేస్తుంటారు. దానమ్మ కడుపుకాల... మన డబ్బులు తీసుకొని అదేం బాగుపడుతుందిలెండి అంటూ తిట్ల వర్షం కురిపించింది సుందరమ్మ.

రాత్రి భోజనాలు చేసి అంతా పడుకున్నారు. మూర్తిగారికి నిద్రపట్టక వసారాలో పచార్లు చేస్తున్నారు. ఫ్రిజ్‌లో మంచినీళ్ళ సీసా తీసుకుందామని కిచెన్‌లోకి వచ్చారాయన. కూతురు బెడ్‌రూమ్‌లోనుంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. ప్రవల్లిక భర్త అరవింద్‌కి రైల్వేలో ఉద్యోగం. మంచి జీతం. ఈమధ్యే కొత్తగా ఇల్లు కొనుక్కున్నారు. అరవింద్ అడుగుతున్నాడు. పవ్ మీ అమ్మా నాన్నా మూటాముల్లె వేసుకొచ్చారు. ఇక్కడే ముకాం పెడతారా ఏంటి? అసలే మద్రాస్‌లో నీళ్ళకు ఇబ్బంది. అదీకాక నువ్వు ఓపిక లేనిదానివి.

అబ్బే... అదికాదండీ ఊరికే నన్ను చూసిపోదామని వచ్చారు.

సరేలే... మొన్న మన కొత్త ఇంటికి రెండు లక్షలు తగ్గింది కదా. అది మీ నాన్నగారిని సాయం చేయమని చెప్పు అన్నాడు అరవింద్.

అలాగే అడుగుతాలెండి. ఇప్పుడు వాళ్ళ పర్సు పోయిందంట. రెండు వేలు ఉంటే ఇవ్వండి అంటూ భర్తను అడిగింది ప్రవల్లిక. ఏమిటీ? పర్సు పోయిందా? ఈ పెద్దవాళ్ళందరికీ ఇదొక అలవాటు. నేరుగా పిల్లల్ని అడగలేక ఇదొక వంక. అన్నీ అబద్ధాలే. అయినా ఆడపిల్లను అడిగేందుకు సిగ్గులేదూ? అవసరమనుకుంటే కొడుకును అడగొచ్చుకదా! అమెరికాలో అడ్డంగా సంపాదిస్తున్నాడు అన్నాడు అరవింద్.

సరేలే ఏడవకు... ఇదిగో రెండు వేలు

నువ్వు బాధపడకూడదని ఇస్తున్నాను. నువ్వు కూడా నీ భర్త అవసరాన్ని అర్థం చేసుకొని మీ నాన్నగారిని ఆ రెండు లక్షలు అడుగు. మళ్ళీ ఇచ్చేద్దాంలే అంటూ భార్యను దగ్గరకు తీసుకున్నాడు అరవింద్.

గేటు దాటి వెళ్తున్న తల్లిదండ్రుల వెనుకే వచ్చిన ప్రవల్లిక అమ్మా నాన్నా అప్పుడే వెళ్ళిపోతున్నారు నాలుగు రోజులు ఉండకుండానే అంది.

లేదమ్మా... మళ్ళీ వస్తాం... నిన్ను ఎలాగూ పురిటికి తీసుకువెళ్ళాలి కదమ్మా అని చెప్పి బయలుదేరారు.

విజయవాడ చేరారు. ఏ.టి.ఎమ్. కార్డు పోయిందన్న విషయాన్ని బ్యాంక్‌లో చెప్పలేదు. అసలు ఆ సంగతే మర్చిపోయారు. అరవింద్ అన్న మాటలే గుర్తుకు వస్తున్నాయి ఆయనకి. ఛీ... ఛీ... ఏం మనుషులు అనుకుంటూ ఏదో ఆలోచిస్తున్నారు.

ఏమండీ! సరుకుల లిస్టు ఇదిగో. అలా బ్యాంకు వరకూ వెళ్ళి ఏ.టి.ఎమ్. కార్డు గురించి మాట్లాడిరండి అంటూ భర్తను బయటకు సాగనంపుతూ బయటకు వచ్చిన సుందరమ్మకి, వీధిలో అడుగుపెట్టబోతున్న మూర్తిగారికి ఎదురుగా ఒక వ్యక్తి వచ్చి నిలబడి నమస్తే మాస్టారూ! నాపేరు జాన్. నేను కావలిలో ఒక బట్టల కొట్టులో పనిచేస్తున్నాను. మొన్న రైలులో మా అమ్మకు మీ పర్సు దొరికింది. ఫోన్ చేస్తూంటే ఎవరూ తీయడం లేదు అంటూ పర్సు చేతికి ఇచ్చి కాళ్ళకు దండం పెట్టి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన వైపే చూస్తూ నిలబడిపోయారు రమణమూర్తి, సుందరమ్మలు. ●



జూన్ 25న విజయవాడలో శ్రీలక్కోజు కనకదుర్గాచార్యులు స్మారక సాహితీ సమితి ఆధ్వర్యంలో 'నానీలు - సంవీక్షణం' పుస్తకావిష్కరణ చేస్తున్న ప్రముఖకవి, విమర్శకులు శ్రీ అద్దేపల్లి రామ్మోహనరావు. చిత్రంలో సాహితీవేత్తలు చలపాక ప్రకాష్, పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ముత్యాల ప్రసాద్, సంపాదకుడు ఎస్. రఘు, అరసవిల్లి కృష్ణ ఉన్నారు.